పరామర్శ



చిన్న నర్సింహ దశదినకర్మలో ఎమ్మెల్యే మల్లారెడ్డి నాయకులు

మేడ్చల్‌రూరల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్‌ఎస్ నాయకుల కుటుంబాలను, రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాయకులను మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సోమవారం పరామర్శించారు. మేడ్చల్ బీఆర్‌ఎస్ నేత నడికొప్పు నాగరాజు తండ్రి, మాజీ ఎంపీటీసీ నడికొప్పు చిన్న నర్సింహ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులు మాజీ కౌన్సెలర్ ఉమానాగరాజును పరామర్శించారు. పూడూర్ గ్రామంలో అనారోగ్యంతో మరణించిన బీఆర్‌ఎస్ నాయకుడు గోపనబోయిన బాలనందం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన బీఆర్‌ఎస్ మాజీ కౌన్సిలర్ తుడుం గణేశ్‌ను పరామర్శించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, మండలాధ్యక్షులు దయానంద్‌యాదవ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు నవీన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాబుయాదవ్, మాజీ ఎంపీటీసీ రఘు, నాయకులు సందీప్‌గౌడ్, శంకర్, మోహన్‌రెడ్డి, అరవింద్, రఘు, చంద్రశేఖర్‌రెడ్డి, డప్పు కృష్ణ, దుంపిగల్ల శంకర్, బక్క శేఖర్, శశికుమార్ యాదవ్, శ్రీకాంత్, కటకం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

నిజాంపేట్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కొలన్ హన్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. గతవారం జర్నలిస్ట్ కాలనీ మారుతీ ఎలైట్ వాసులు కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈమేరకు సోమవారం కాలనీలో పర్యటించారు. కమిషనర్‌తో మాట్లాడి స్థానిక సమస్యలు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ టీకుల ప్రవీణ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, కుమార్‌యాదవ్, పితాని శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

కుత్బుల్లాపూర్: పేకాట స్థావరంపై పేట్‌బషీరాబాద్ పోలీసులు దాడులు చేసి 8 మందిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లిలోని స్కైలీవ్ అపార్ట్‌మెంట్‌లో పేకాడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో అడ్డాపై దాడులు నిర్వహించారు. 8 మంది పేకాడుతూ పట్టుబడగా వారి నుంచి రూ.27,600, ఆన్‌లైన్‌లో రూ.19,200 నగదుతో పాటు 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి వారిని స్టేషన్‌కు తరలించారు.

‘విద్యార్థుల అరెస్టు అన్యాయం’

అల్విన్‌కాలనీ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను ఆదివారం రాత్రి అరెస్టు చేయడం అన్యాయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వీరమల్ల కేశవరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1974లో 2300 ఎకరాల విస్తీర్ణంలో విశ్వవిద్యాలయం స్థాపించారన్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలుకు కావాల్సిన నిధులు సమకూర్చేందుకు ఈ యూనివర్సిటీ భూములు విక్రయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. భూముల విక్రయాన్ని శేరిలింగంపల్లి ప్రజలు, విద్యార్థులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని, వారికి అండగా పార్టీ పోరాడుతుందని పేర్కొన్నారు.

పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదం

మల్లాపూర్: నాచారం పారిశ్రామికవాడలోని ఆరిజన్ కంపెనీ స్క్రాప్ గొడౌన్‌లో సోమవారం ఉదయం స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగరావడంతో చుట్టు పక్కలవారు ఆందోళనకు గురయ్యారు. హుటాహుటిన ఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్లు చేరుకుని సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం

మేడిపల్లి: ముగ్గురు పిల్లలతో సహా ఓ మహిళ అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌లో నివాసం ఉంటున్న రాముడు భార్య శివలీల (25)కుమార్తె, ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటూ.. స్థానికంగా కూలీపని చేస్తున్నాడు. కాగా ఈనెల 23న ఉదయం భర్త పని కోసం వెళ్లగానే భార్య ముగ్గురు పిల్లలతో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త సోమవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోగమొస్తే.. ఆస్తులు అమ్ముకోవాల్సిందే..

ఎండా, వానా, చలి ఏ కాలమైనా సరే.. సీజన్ మారితే చాలు ఆస్పత్రులకు క్యూ కట్టాల్సి వస్తోంది. వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే అరకొర సౌకర్యాలు వెంటాడుతున్నాయి. మందులు ఉండవు.. టెస్టులు చేయరు.. దీని కోసం మళ్లీ మెడికల్స్, ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లను ఆశ్రయించాల్సిందే.. ఈ అవస్థల నుంచి తప్పించుకునేందుకు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. అందులోకి వెళ్లి వచ్చే సరికి జేబు ఖాళీ అవుతోందే తప్ప రోగాలు నయం కావడం లేదు. దానికి కారణం అనుమతులు లేని ఆస్పత్రులతో పాటు అవగాహన లేని వైద్యులే అని పలువురు ఆరోపిస్తున్నారు. పుట్టగొడుగుల్లా అనుమతులు లేని క్లినిక్‌లు వెలుస్తున్నా వైద్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- నిఘా లేక ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ
- అనుమతులు లేని ఆస్పత్రులు వందల సంఖ్యలో..
- అవగాహన లేకుండా వైద్యం చేస్తున్న వైనం
- రోగుల నుంచి ఇష్టానుసారంగా వసూళ్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రోగుల అటెండర్స్
- చర్యలకు సిద్ధమైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ



ప్రైవేట్ క్లినిక్ సీజ్ చేసి నోటీసులు అందజేస్తున్న వైద్య శాఖ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: సేవ ముసుగులో అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు రోగులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. కేవలం ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తూ రోగుల పాలిట శాపంగా మారుతున్నాయి. నిపుణులైన వైద్యులు లేకపోవడంతో పలువురు రోగులు మృత్యువాత పడుతున్నారు. అలాంటి ఘటనలు జరిగినప్పుడు హడావుడి చేస్తున్న జిల్లా వైద్యశాఖ అధికారులు ఆ తర్వాత మామూళ్ల మత్తులో జోగుతున్నారు. రోగులు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసింది. వసతులు, ప్రమాణాలు లేకుండా నిర్వహిస్తున్న వాటిపై కొరడా ఝులిపిస్తోంది. అనుమతి లేని ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, డెంటల్, ఐ క్లీనిక్‌లు, ఫిజియోథెరపీ సెంటర్లు, స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్లతో పాటు అర్హత లేని డాక్టర్లు, ఫార్మసిస్టులు, ఇతర సిబ్బందిని గుర్తించి తక్షణ చర్యలకు జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 20 ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టిన వైద్యశాఖ ప్రభుత్వ నిబంధనలు, ప్రమాణాలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులను సీజ్ చేయడంతో పాటు కొన్ని ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

ప్రైవేట్ ఆస్పత్రులివే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,600లకుపైగా ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ గుర్తించింది. ఇందులో వంద కంటే ఎక్కువ బెడ్స్ ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు 48 ఉండగా, 20 నుంచి 100 బెడ్ల వరకు ఉన్న ఆస్పత్రులు 317 ఉన్నాయి. 20 బెడ్స్‌లోపు ఉన్న ఆస్పత్రులు



294, పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు 712, డెంటల్ ఆస్పత్రులు 180, ఫిజియోథెరపీ సెంటర్లు 46, రీహాబిలిటేషన్ సెంటర్లు 8 ఉన్నాయి. జిల్లాలో అనుమతులు ఉన్న స్కానింగ్ సెంటర్లు 628 ఉండగా, అనుమతి లేనివి 400 వరకు ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ పేర్కొంటోంది. ఈ ప్రైవేట్ ఆస్పత్రుల్లో జనరల్ ఫిజీషియన్లు, పీడియాట్రిక్, గైనకాలజిస్టులు తదితర వైద్య నిపుణులు ఉన్నారంటూ బోర్డులు, ప్రచార కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దానికితోడు అన్నీ తామై డబ్బుల కోసం శస్త్రచికిత్సలు సైతం నిర్వహిస్తున్నారు.

నిర్లక్ష్యంతో నిర్వహణ..

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో చెలగాటం ఆడుతున్నట్లు తనిఖీల్లో తేటతెల్లమవుతున్నట్లు తెలుస్తోంది. ఫీజుల వసూళ్లలోనూ ప్రైవేట్ ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అవసరానికి మించి వైద్యపరీక్షలు చేయడంతో పరోక్ష దోపిడీకి పాల్పడుతున్నాయి. ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ఆస్పత్రి నిర్వహించరాదని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ.. కొందరు పట్టించుకోవడం లేదు.

ఆ ఆస్పత్రులపై చర్యలు తప్పవు



ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీల్లో భాగంగా జిల్లాలో పలు ప్రైవేటు ఆస్పత్రులను సీజ్ చేయటంతో పాటు మరి కొన్నింటికి నోటీసులు జారీ చేశాం. ప్రభుత్వ నిబంధలు, ప్రమాణాలు పాటించని పలు ప్రైవేట్ ఆస్పత్రులపై విచారణ జరుగుతోంది. వసతులు లేకుండానే ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేసే ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఉమాగౌరి, జిల్లా వైద్యాధికారి, మేడ్చల్–మల్కాజిగిరి.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు

పనులను పరిశీలించిన తహసీల్దార్, హెచ్ఎండీఏ అధికారులు

జవహర్‌నగర్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు కాప్రా తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో హెచ్ఎండీఏ అధికారులతో కలిసి సోమవారం చెన్నాపురం చౌరస్తా నుంచి కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుచరిత మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, చెన్నాపురం నుంచి ఆర్మీ డెంటల్ కళాశాల రోడ్డులో విస్తరణ పనులు మొదటిదశలో ఉన్నాయని, కరెంట్ స్తంభాలు, చెట్లను తొలగిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు విస్తరణతో జవహర్‌నగర్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయన్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. హెచ్ఎండీఏ ఏఈఈ జీవన్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్, టీపీవో స్రవంతి, రెవెన్యూ, మున్సిపల్, హెచ్ఎండీఏ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుచరిత, హెచ్ఎండీఏ అధికారులు



కీసరగుట్ట స్వామివారికి క్షీరాభిషేకం



స్వామి వారి పల్లకీసేవ



హారతి తీసుకుంటున్న భక్తులు

కీసరగుట్ట స్వామివారికి పల్లకీ సేవ

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామివారికి వేద పండితులు పల్లకీ సేవను వైభవంగా సోమవారం నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం వేదపండితులు స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు కీసరగుట్టకు తరలివచ్చారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి 15,500 దరఖాస్తులు

ఉప ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: రాజీవ్ యువ వికాసం పథకానికి వీలైనంత ఎక్కువ మంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా జాగ్రత్తలు తీసుకున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి రాజీవ్ యువ వికాసం పథకంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో వార్డుల వారీగా ప్రజాపాలన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకం కింద ఇప్పటి వరకు 15,500పైగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ అయ్యాయని తెలిపారు. మూడు రోజులు వరుస సెలవులు వచ్చినందున గడువు ముగింపు తేదీ పెంచాలని కోరారు. ఇప్పటికే ఆయా శాఖల ద్వారా పలుమార్లు ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో రాజీవ్ యువవికాసం పథకానికి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునే విధంగా యువతను ప్రోత్సహించే విధంగా సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకానికి ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి వీలైనంత ఎక్కువ మంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఏప్రిల్–5లోపు దరఖాస్తు చేసుకునే విధంగా సంబంధిత అధికారులు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలలోపు, పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.2 లక్షలలోపు ఉండాలన్నారు.



గౌతమ్

ఆస్తిపన్ను కట్టలేదని.. దుకాణం ముందు గుంత తవ్వారు



చందానగర్ : ఆస్తిపన్ను బకాయిలు కట్టలేదని వాప్యారం సముదాయం ముందు జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ 21 అధికారులు జేసీబీతో గుంత తవ్వారు. దీంతో వెంటనే సముదాయం యజమాని సోమవారం బకాయి ఉన్న రూ.30 లక్షలకు గాను రూ.15 లక్షలు చెల్లించి మరో రూ.15 లక్షలు రాయితీ పొందాడని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలలోకి వెళితే.. బకాయిదారులు 2018 సంవత్సరం నుంచి ఆస్తి పన్ను చెల్లించడం లేదని పలుమార్లు నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ఆదివారం గుంత తవ్వారు. దీంతో అతను కార్యాలయంకు వచ్చి రూ.15లక్షలు ఆస్తి పన్ను బకాయి చెల్లించాడు.

ఉద్యోగ విరమణ తర్వాత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలి



ఉద్యోగ విరమణ చేసిన కిష్టయ్యను సత్కరించిన డీఎంహెచ్ఓ డా.ఉమాగౌరి

పోచారం: ఉద్యోగ విరమణ తర్వాత సంతోషంగా, ప్రశాంతమైన జీవితం గడపాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ సి.ఉమాగౌరి అన్నారు. నారపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2 హోదాతో ఉద్యోగ విరమణ చేసిన కళ్లెం కిష్టయ్యకు సోమవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో నిబద్ధతతో పనిచేసిన కిష్టయ్య ఎంతో అభినందనీయులన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంతమైన జీవితం గడాలని ఆకాంక్షించారు. అనంతరం కిష్టయ్య, సుధామాధురి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కీసర డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి, నారపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్యర్ శోభన, ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గీత, సూపర్‌వైజర్ భోగి ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

ప్రేమ, కరుణ, ఐకమత్యం అనే సందేశాల సారం.. సేవా తత్పరత, ఆధ్యాత్మికత వెల్లివిరిసే సంబురం ఈద్–ఉల్–ఫితర్ పర్వదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. సహనం, దాన, దయ గుణాన్ని, సోదర భావాన్ని, శాంతి సామరస్యాలను పెంపొందించే పవిత్ర పర్వదినం రంజాన్ సందర్భంగా తెల్లవారుజాము నుంచే మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొత్త దుస్తులు ధరించిన ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని అన్ని ప్రాంతాల్లో రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, మహేశ్‌గౌడ్



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య



మేడ్చల్‌లో ఎమ్మెల్యే మల్లారెడ్డి, నాయకులు భాస్కర్‌యాదవ్ తదితరులు



శామీర్‌పేటలో రంజాన్ వేడుకలు



జవహర్‌నగర్‌లోని ఈద్గాలో ప్రార్థనలు



నాగారం మున్సిపాలిటీలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఎల్లంపేట్‌లో ఎస్‌ఐ మన్మథ్‌రావు, బీజేపీ నాయకుడు జగన్‌గౌడ్



నారపల్లిలో ముస్లింలను కలిసిన మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి తదితరులు



మేడ్చల్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు